సాక్షి
కుమురం భీం

మంగళవారం । 11 । మార్చి । 2025



జనసంద్రమైన 'వెంకన్న' జాతర

కెరమెరిలో నిర్వహిస్తున్న వెంకటేశ్వరస్వామి జాతర జనసంద్రమైంది. ఆది, సోమవారాల్లో జనం పెద్దఎత్తున తరలివచ్చారు. జాతరలో తిరుగుతూ భక్తులు సందడి చేశారు. 9లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ : 6:21	బుధ : 5:11

గరిష్టం/కనిష్టం
36.6 /21.8

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత కూడా పెరుగుతుంది. అర్ధరాత్రి తర్వాత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ



పతకాలతో విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ గురుకులానికి చెందిన విద్యార్థినులు మౌంటెన్ బైక్ సైక్లింగ్‌లో ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారద సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన తొమ్మిదో రాష్ట్రస్థాయి మౌంటెన్ బైక్ సైక్లింగ్‌లో కళాశాలకు చెందిన స్నేహ టైం ట్రయల్ 20 కిలోమీటర్లు, మాస్ స్టార్ట్స్ 40 కిలోమీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించిందని తెలిపారు. అలాగే వాణిశ్రీ రజత పతకం, ప్రియాంక కాంస్య పతకం, శ్రీదేవి రజత పతకం సాధించారని వెల్లడించారు. విద్యార్థినులు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని పీడీ హారిక ఆకాంక్షించారు.

అందవెల్లి వంతెనపై రాకపోకలు షురూ



పూర్తయిన అప్రోచ్ రోడ్డు

దహెగాం(సిర్పూర్): కాగజ్‌నగర్ మండలం అందవెల్లి గ్రామ సమీపంలోని పెద్దవాగుపై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్డు పనులు పూర్తికావడంతో సోమవారం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. 2021లో భారీ వరదలకు పెద్దవాగు ఉప్పొంగి వంతెన కుంగిన విషయం తెలిసిందే. మరోసారి వరదలు వచ్చి వంతెన మరింత కుంగి ప్రమాదకరంగా మారింది. 2023లో వంతెన కూలడంతో పూర్తిగా రాకపోకలు నిలి చిపోయాయి. వాగులో తాత్కాలిక రోడ్డు వేసి రాకపోకలు సాగించారు. గతేడాది వంతెన మరమ్మతులు పూర్తి కాగా, వర్షాకాలంలో మట్టితో తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డు వేసి ప్రయాణాలు పునరుద్ధరించారు. గత నెలలో మళ్లీ అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించడంతో మరోసారి వాగులో నుంచి తాత్కాలిక రోడ్డు వేశారు. అప్రోచ్ రోడ్డు పనులు పూర్తికావడంతో వాహనాల రాకపోకలకు అనుమతించారు.

జిల్లా క్రీడాకారులకు పతకాలు



పతకాలతో పోలీసు క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): హర్యానా రాష్ట్రంలోని కర్నాల్‌లో జరిగిన 73వ ఆల్ ఇండియా పోలీస్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ టీం ఈవెంట్‌లో రాష్ట్ర జట్టు తరుపున బరిలో దిగిన జిల్లా క్రీడాకారులు కాంస్య పతకాలు సాధించినట్లు సెపక్‌తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 7 నుంచి జరుగుతున్న ఆల్ ఇండియా పోలీస్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో రెబ్బెన మండలానికి చెందిన పోలీస్ క్రీడాకారులు ఆర్.వెంకటేశ్, ఆడే రాజేందర్, పి.గోపి అద్భుత ఆటతీరు ప్రదర్శించారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో కాంస్య పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులను ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా వైస్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, సెపక్ తక్రా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శిరీష అభినందించారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని సీపీఎం పార్టీ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని వట్టివాగు, అడ ప్రాజెక్టు, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుల్లో నీరున్నా పంటల సాగుకు ఉపయోగపడటం లేదన్నారు. కాలువలకు మరమ్మతులు లేకపోవడం, అసంపూర్తిగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన్న, నాయకులు దినకర్, శ్రీనివాస్, ఆనంద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి నిబంధనాలు

- కొత్త జాబ్‌కార్డుల జారీని తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వం
- జాబ్‌కార్డు లేక ఉపాధికి దూరమవుతున్న కూలీలు
- 'ఆత్మీయ భరోసా'తో గ్రామాల్లో పనులకు పెరిగిన డిమాండ్



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో కొత్త జాబ్‌కార్డుల మంజూరులో విధించిన నిబంధనలు కొత్త కూలీల పాలిట శాపంగా మారింది. కొన్ని నెలలుగా కొత్తగా కార్డులు జారీని నిలిపివేయడంతో అర్హులకు ఉపాధి దక్కడం లేదు. ఉపాధిహామీ చట్టం ప్రకారం ఆసక్తి చూపే ప్రతీ కూలీకి తప్పనిసరిగా పనులు కల్పించాల్సిందే. కానీ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు చట్టానికే తూట్లు పొడుస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.

వేసవిలో ఉపాధి పనులే దిక్కు..

జిల్లా ప్రజలకు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రజలంతా వ్యవసాయం పైనే ఆధారపడుతున్నారు. జనవరి నాటికే వానాకాలం పంటల సీజన్ పూర్తవుతుంది. వ్యవసాయ కూలీలు, భూమి లేని నిరుపేదలకు ఉపాధిహామీ పనులే దిక్కుగా మారుతాయి. జనవరి నుంచి జూన్ వరకు కొనసాగే ఉపాధిహామీ పనులు వేసవిలో కూలీలకు బాసటగా నిలుస్తున్నాయి. ఈజీఎస్ కింద కూలీలకు చెల్లించే రోజువారి కూలి సైతం పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏటా జిల్లాలో ఉపాధిహామీ పనులు చేసే కూలీల సంఖ్య సైతం పెరుగుతోంది. జిల్లాలో మంజూరైన జాబ్‌కార్డులకు, పనిచేసే కూలీల సంఖ్యకు పొంతన ఉండటం లేదు. అధికారులు జిల్లాలో 1,23,035 జాబ్‌కార్డులను మంజూరు చేయగా, ప్రస్తుతం కేవలం 91,721 జాబ్‌కార్డులు మాత్రమే యాక్టివ్‌లో ఉన్నాయి. 2,43,969 మంది కూలీలు ఉండగా 1,70,268 మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు.

పెరిగిన డిమాండ్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12వేలు ఆర్థికసాయం అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంగా నామకరణం చేసి భూమి లేని నిరుపేదలకు ఆర్థికసాయం అందించేందుకు కసరత్తు ప్రారంభించింది. అయితే పేదలను గుర్తించేందుకు ఉపాధిహామీ పథకంలో ఏడాదిలో కనీసం 20 రోజులపాటు పనిచేయాలని నిబంధన విధించారు. జనవరిలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి లబ్ధిదారులకు రూ.6వేల నగదు అందించింది. దీంతో ఉపాధిహామీ పనులు చేసే కూలీలకే ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందనే భావనతో గ్రామీణ ప్రాంత ప్రజలు పనుల కోసం దరఖాస్తులు అందిస్తున్నారు. భూములు ఉన్న రైతులు సైతం కొత్తగా జాబ్‌కార్డుల కోసం ఆసక్తి చూపుతున్నారు. ఈజీఎస్ అధికారులు కొత్త జాబ్‌కార్డుల మంజూరుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో దరఖాస్తులు స్వీకరించి దగ్గర పెట్టుకుంటున్నారు. మరోవైపు ఇప్పటికే జాబ్‌కార్డులు ఉన్న కూలీలు పూర్తిస్థాయిలో పనులకు రావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. గతంలో స్వచ్ఛ భారత్ మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను కూడా జాబ్‌కార్డులు ఉన్న వారికి మాత్రమే మంజూరు చేశారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తయి బిల్లులు తీసుకున్న వారు జాబ్‌కార్డులను పక్కన పడేశారు. రైతులు సైతం వ్యవసాయ భూముల్లో పనుల కోసం జాబ్‌కార్డులు తీసుకుని పనులు చేయించుకుంటున్నారు. ఆ తర్వాత పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపకపోవడంతో పనిచేసే కూలీల సంఖ్య తగ్గుతోంది. ఇప్పుడు కొత్త జాబ్‌కార్డుల మంజూరు, మార్పులు చేర్పులపై ఆంక్షలు విధించడంతో కొత్తగా పని చేసేందుకు ఇష్టపడుతున్న కూలీలపై ప్రభావం పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు జాబ్‌కార్డులు మంజూరు చేసి పనులు కల్పించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన కొత్త కార్డుల జారీ

వేసవిలో చేసేందుకు పనులు లేక ఉపాధి కోసం ఆరాటపడే కూలీలకు ఉపాధిహామీ వరంలా మారింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్‌కార్డుల మంజూరును తాత్కాలికంగా నిలిపివేయడంతో కొత్తగా పనులు చేసేందుకు ఆసక్తి చూపే కూలీలు ఉపాధి పనులకు దూరమవుతున్నారు. కొత్త జాబ్‌కార్డుల జారీతోపాటు పాత జాబ్‌కార్డులో పేర్ల తొలగింపులు, చేర్పుల ప్రక్రియపై సైతం నిబంధనలు విధించింది. చనిపోయిన కూలీల పేర్ల తొలగింపు ప్రక్రియ సైతం నిలిచిపోవడంతో పనిచేసే కూలీల సంఖ్య తగ్గుతోంది. పెళ్లికి ముందు తల్లిదండ్రులతో కలిసి జీవించి వివాహ అనంతరం వేరు కాపురం ప్రారంభించిన కుమారులకు సైతం కొత్త జాబ్‌కార్డులు రావడం లేదు. పలువురు పనులు చేసేందుకు ముందుకొస్తున్నా అధికారులు వారికి అవకాశం కల్పించలేకపోతున్నారు. చేసేదేమీ లేక కూలీలు ఇతర పనులను వెతుక్కుంటున్నారు. వేసవి ప్రారంభం కావడంతో పనుల కోసం కూలీలు వలస వెళ్లాల్సి వస్తోంది.

విచారణ తర్వాతే జారీ

ఉపాధిహామీ పనులు చేసేందుకు జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే తప్పకుండా జారీ చేస్తాం. కానీ ఆత్మీయ భరోసా పథకం వర్తించాలనే కోరికతో జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే.. అలాంటి వాటిని విచారణ చేపడతాం. ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేస్తుండటంతో కొత్త జాబ్‌కార్డుల కోసం చాలామంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. అర్హత ఉంటేనే కొత్త జాబ్‌కార్డు ఇస్తున్నాం.

– దత్తారావు, డీఆర్‌డీవో

దివ్యాంగులకు యూనిక్ డిజేబులిటీ ఐడీ



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రస్తుతం అందిస్తున్న సదరం సర్టిఫికెట్ స్థానంలో దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం యూనిక్ డిజేబులిటీ ఐడీలను అందుబాటులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా పరిషత్, జిల్లా సంక్షేమశాఖ, వైద్యారోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, దివ్యాంగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు 21 కేటగిరీల్లో యూడీఐడీ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఉన్న వారికి స్పీడ్ పోస్టు ద్వారా కార్డులు పంపిస్తారని పేర్కొన్నారు. దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. డీఆర్‌డీవో దత్తారావు, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం వద్ద పటిష్ట బందోబస్తు

జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం వద్ద పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. ఈవీఎం గోదాంను సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.

నేడు సీసీ రోడ్ల నిర్మాణంపై శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న సీసీరోడ్లు నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేసేందుకు విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఒకరోజు శిక్షణ అందిస్తున్నట్లు పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి మేస్త్రీలు, వీడీసీ కమిటీ సభ్యులు హాజరుకావాలని సూచించారు.

పదోన్నతితో మరింత బాధ్యత



ఎస్పీకి మొక్క అందిస్తున్న ఎస్సై ఉల్లాస్

ఆసిఫాబాద్‌అర్బన్/కెరమెరి: పదోన్నతితో ఉద్యోగిపై మరింత బాధ్యత పెరుగుతుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. కెరమెరి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న జాదవ్ ఉల్లాస్ ఎస్సైగా పదోన్నతి పొందగా, సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. 1989లో ఉల్లాస్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందగా 2012లో హెడ్ కానిస్టేబుల్, ఆ తర్వాత ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆయనను జైనూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా నియమించారు. గతంలో ఆదిలాబాద్, ఇంద్రవెల్లి, సోన్, నీల్వాయి, కెరమెరి పోలీస్ స్టేషన్‌లలో పనిచేశారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆరోగ్యం కాపాడుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన సెకండియర్ ఇంగ్లిష్ పరీక్షకు 5,046 మంది విద్యార్థులకు 4,917 మంది హాజరుకాగా, 129 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విభాగంలో 4,315 మందికి 4,207 మంది, ఒకేషనల్ వి భాగంలో 731 మందికి 710 మంది హాజరయ్యారని డీఐఈవో కళ్యాణి తెలిపారు. ఆసిఫాబాద్, కౌటాల, దహెగాంలోని పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

జిల్లాలో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, సౌకర్యాల కల్పన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

సాగు నిర్వహణ సమర్థవంతంగా జరగాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సాగునీటి నిర్వహణ సమర్థవంతంగా జరగాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ యాసంగి పంటలను కాపాడేందుకు ప్రాజెక్టుల నుంచి విడుదల చేసే నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, వ్యవసాయశాఖ అధికారుల నివేదిక ఆధారంగా విద్యుత్ అధికారులను సమన్వయం చేసుకుంటూ పంటలు ఎండిపోకుండా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని తగ్గించాలన్నారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు లేవని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నుంచి చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడారు. జిల్లాలోని సాగునీటి వనరులను వినియోగించుకుంటూ చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఏటీడీవో శ్రీనివాస్

కెరమెరి(ఆసిఫాబాద్): పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏటీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలో ని జోడేఘాట్, బాబేఝరి, హట్టి ఆశ్రమ పాఠశాలలను సోమవారం సందర్శించారు. పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలకు పరిశీలించారు. వార్షిక పరీక్షలకు పది రోజులే గడువు ఉన్నందున కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని సూచించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేయాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు మోతీరాం, జంగు, పంచపుల తదితరులు ఉన్నారు.

అర్జీలు వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- కలెక్టరేట్‌లో ప్రజావాణి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజావాణిలో ప్రజలు అందించే అర్జీలను అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తన పట్టా భూమికి హద్దులు నిర్ధారించాలని రెబ్బెన మండలం నంబాల గ్రామానికి చెందిన మసాడి రాజేశ్వరి దరఖాస్తు చేసుకుంది. ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టులో చేపలు పెంచడానికి అవకాశం కల్పించాలని తిర్యాణి మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీలు కోరారు. తన పట్టా భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని బెజ్జూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన చాపిడి శంకర్ విన్నవించాడు. దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని చింతలమానెపల్లి మండలం ఖర్జెల్లికి చెందిన చౌదరి ఓంకార్ వినతిపత్రం సమర్పించాడు. ప్రస్తుతం తాను సాగు చేసుకుంటున్న భూమికి పట్టా మంజూరు చేయాలని బెజ్జూర్ మండలం ముంజంపల్లికి చెందిన నికోడే లచ్చుంబాయి వేడుకుంది. సదరం సర్టిఫికెట్ అందించాలని కౌటాల మండలానికి చెందిన శంకర్ కోరాడు. దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని వాంకిడి మండలానికి చెందిన మురళీ, మహేందర్ దరఖాస్తు చేసుకున్నారు. వాంకిడి మండలం సరండి శివారులోని భూమిని ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలని రాజేశ్వర్ విన్నవించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు నిర్ణీత గడువులోగా న్యాయం చేయాలన్నారు.

వేతనం రావడం లేదు



చింతలమానెపల్లి మండలం డబ్బా రైతువేదికలో 2021 నుంచి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నా. ప్రారంభంలో మూడు నెలలు సక్రమంగా చెల్లించారు. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు వేతనం రావడం లేదు.

– నక్క జగానంద్, చింతలమానెపల్లి

బిల్లులు మంజూరు చేయాలి



జైనూర్ మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల యూనిఫాం కుట్టు కూలి మంజూరు కాలేదు. యూనిఫాంలకు సంబంధించిన బిల్లులు రూ.10లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో టెండర్ వేరే వ్యక్తికి కట్టబెట్టడంతో ఉపాధి కోల్పోతున్నాం. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.

– పద్మ, జైనూర్

ఉద్యోగాలు ఇప్పించాలి



కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పొరుగు సేవల పద్ధతిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నాం. తమను ఎలాంటి కారణం లేకుండా ఉద్యోగాల నుంచి తొలగించారు. మా స్థానంలో ఇతరులకు పోస్టింగ్ ఇస్తున్నారు. అధికారులు స్పందించి ఉద్యోగాలు ఇప్పించాలి.

– పోల్కర్ దినేష్, రాజేశ్వర్, సంతోష్, శ్రీలక్ష్మి

కొడుకు పట్టించుకోవట్లే..



నా భర్త పసునూరి శంకర్ ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తూ 2001లో జోడేఘాట్‌లో జరిగిన పేలుళ్లలో మరణించడంతో మా కుమారుడు శంకర్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు. కొన్నేళ్లుగా నా కొడుకు నా బాగోగుల గురించి పట్టించుకోవడం లేదు. అతని వేతనం నుంచి ప్రతినెలా సగం నాకు ఇప్పించాలి. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

– పసునూరి తారాబాయి, ఆసిఫాబాద్

ఉద్యోగులకు అభినందన



ఉద్యోగులను అభినందిస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ గడిచిన ఫిబ్రవరిలో అధిక ఉత్పత్తిని సాధించడంతో ఓసీపీలో పనిచేస్తున్న ఉద్యోగులను ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి అభినందించారు. సోమవారం కైరిగూడ ఓసీపీని సందర్శించి కైరిగూడ ఓసీపీ 135 శాతం బొగ్గు ఉత్పత్తి సాధనకు కృషి చేసిన ఉద్యోగులను ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో బెల్లంపల్లి ఏరియాకు 37.5లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 21 రోజుల గడువు మిగిలి ఉందని, వందశాతం ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి నరేందర్, ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, సేఫ్టీ అధికారి నారాయణ, మేనేజర్ శంకర్, డీవైపీఎం వేణు, నాయకులు శేషు, దివాకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీడ్రైవర్‌కు 18నెలల జైలు

మందమర్రిరూరల్: లారీని అజాగ్రత్తతో నడిపి కానిస్టేబుల్ మృతికి కారణమైన లారీ డ్రైవర్ సుధాకర్‌రెడ్డికి 18 నెలల జైలుశిక్ష తోపాటు రూ.8 వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల జిల్లా అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉపనిషద్వని సోమవారం తీర్పు చెప్పారు. మందమర్రి ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మందమర్రిలోని అందుగుల పేట సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల వద్ద జాతీయ రహదారిపై 2016, అక్టోబర్ 5న కానిస్టేబుల్ జక్కని శ్రీధర్ బైక్‌పై వెళ్తున్నాడు. డ్రైవర్ అజాగ్రత్తగా లారీ నడిపి బైక్‌ను ఢీకొట్టగా శ్రీధర్ మృతిచెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి 15 మంది సాక్షులను ప్రవేశ పెట్టి పీపీ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్లు మధుసూదన్, సురేందర్, లైజనింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లను సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ అభినందించారు.

చెరువులో మునిగి మనుబోతు మృతి!


మనుబోతు కళేబరం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్–పాత తర్లపాడ్ మార్గమధ్యలోని చింతల చెరువులో పడి మనుబోతు మృతిచెందింది. దుర్వాసన రావడంతో ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు అందించిన సమాచారంతో అటవీ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతం నుంచి నీరు తాగేందుకా, కుక్కలు వెంటాడితే వచ్చి నీట మునిగి చనిపోయి ఉంటుందని ఎఫ్ఆర్వో కిరణ్ తెలిపారు. అనంతరం జంతువుకు పోస్టుమార్టం నిర్వహించి, ఈ మేరకు విచారణ చేపట్టామన్నారు.

రౌడీషీటర్‌పై దాడి

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని శివాజీ గ్రౌండ్‌లో రౌడీషీటర్ ఎర్రగుంటపల్లి సంపత్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి దాడి చేశారు. తీవ్రగాయాలైన అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సంపత్‌పై గతంలో పలు భూవివాదాలు, ఇతర కేసులు ఉన్నాయి. దాడికి పాల్పడిన వ్యక్తుల ఎవరనేది తెలియరాలేదు. ఈ విషయమై సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

చెన్నూర్‌లో చైన్ స్నాచింగ్


సీసీ ఫుటేజీలో రికార్డు అయిన సర్కిల్‌లో ఉన్న వ్యక్తి

చెన్నూర్: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. స్థానిక విశ్వకర్మ కాలనీకి చెందిన జంగం మణమ్మ కాలినడక సోమవారం మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి లైన్‌గడ్డకు వెళ్తుంది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో బంగారం గొలుసు ఎత్తుకెళ్లాడని బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సామగ్రి చోరీ చేసిన నలుగురి అరెస్టు

తాండూర్: సింగరేణి సామగ్రిని చోరీ చేసిన నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. తాండూర్ పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మందమర్రికి చెందిన మోతే రాజయ్య, మోతే నర్సయ్య, తిరుపతి, మధు గ్రామాల్లో సబ్బులు, సర్ఫ్‌లు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. గతనెల 8న గోలేటి వర్క్‌షాప్ ఏరియా స్టోర్స్‌లో సింగరేణి అధికారులు భద్రపర్చిన రూ.6.22 లక్షల విలువైన ఇత్తడి పరికరాలను ఎత్తుకెళ్లారు. ఇత్తడిని కరిగించి ముద్దగా చేశారు. అధికారులు ఇచ్చిన వీడియోలు, ఇతర ఆధారాలతో దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు. సోమవారం ఆ నలుగురు రెండు బైక్‌లపై మందమర్రి నుంచి తాండూర్ వైపు వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఇత్తడి ముద్దలు, రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు. సమావేశంలో మాదారం ఎస్సై సౌజన్య పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిశారు..

- ప్రతిభ కనబర్చిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- పతకాలతో సత్తాచాటుతూ..
- అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం

వారందరిది నిరుపేద కుటుంబ నేపథ్యం. అయినప్పటికీ భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని చదువును కొనసాగిస్తూనే క్రీడారంగాన్ని ఎంచుకున్నారు. అథ్లెటిక్స్‌లో నిరంతరం సాధన చేసి ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధిస్తున్నారు. అంతర్జాతీయ పోటీలకు దేశం తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత నెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో 11వ తెలంగాణ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లోనూ ప్రతిభ కనబర్చారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులపై ప్రత్యేక కథనం.

– ఆదిలాబాద్


రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

ఎన్ఐఎస్ శిక్షకుడినవుతా



బజార్‌హత్నూర్ మండలం మంజారం తండాకు చెందిన గురుదయాల్ సింగ్–శారద బాయి దంపతుల కుమారుడు అజాడే అనిల్. ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. ఈయన అథ్లెటిక్స్‌లో హేమర్ త్రో, స్టీపుల్ చేజ్, ట్రిపుల్ జంప్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నాడు. 2019 పూణెలో జరిగిన స్విమ్మింగ్ జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. ఇటీవల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఒక వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు. అంతర్జాతీయ పోటీల్లో విజేతగా నిలవడమే కాకుండా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్‌గా వ్యవహరించడమే తన లక్ష్యమని, ఇందుకోసం శిక్షకులు వీజీఎస్ రాకేశ్, వీజీఎస్ జోల పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నా.

గ్రూప్–1 ఆఫీసర్ కావడమే లక్ష్యం..



ఆదిలాబాద్‌కు చెందిన ప్రవీణ్–గీత దంపతుల కుమారుడు డి.చంద్రసిద్ధార్థ.. ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఐదో తరగతి నుంచే ఆటలపై మక్కువ పెంచుకుని, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తున్నాడు. అథ్లెటిక్స్‌లో రేస్‌వాక్ ఈవెంట్లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం గెలుపొందాడు. 2022లో జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించాడు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఉత్తీర్ణత సాధించాడు. సైనికుడిగా విధులు నిర్వర్తిస్తూనే, తన చిన్ననాటి కల అయిన గ్రూప్–1 ఆఫీసర్ కావడమే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నాడు.

అంతర్జాతీయ స్థాయిలో మెరిశాడు



ఇచ్చోడ మండలం దేవుల్ నాయక్ తండాకు చెందిన రమేశ్ రాథోడ్–లక్ష్మీబాయి దంపతులకు కుమారుడు రాథోడ్ వంశీ. గతేడాది జూలైలో నేపాల్‌లో జరిగిన టార్గెట్ బాల్‌పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించాడు. ఇందులో భారత్ రెండో స్థానంలో నిలువగా, వెండి పతకం నిలబెట్టుకున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో హామర్ త్రో ఈవెంట్లో రెండుసార్లు రజత పతకాలు సాధించగా, ఓసారి కాంస్య పతకంతో విజేతగా నిలిచాడు. కాకతీయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ స్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ క్రీడలో ప్రాతినిధ్యం వహించి రాణించాడు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా కావడమే లక్ష్యంగా ప్రతీరోజు నాలుగు గంటలు మైదానంలో శ్రమిస్తున్నాడు.

శిక్షకుల ప్రోత్సాహంతోనే..



బేల మండలం సిర్సన్నకు చెందిన ఎస్కే ఫిరోజ్– షరీఫా దంపతుల కుమార్తె ముస్కాన్. అథ్లెటిక్స్ పోటీల్లో విజేతగా నిలుస్తోంది. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో డీ.పెడ్ కోర్సు చేస్తున్న ఆమె హ్యామర్‌త్రో ఈవెంట్‌లో మూడు పతకాలు సాధించింది. హైదరాబాద్, హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం, రజతం, ఉస్మానియా యూనివర్సిటీ స్థాయిలో కాంస్య పతకాలతో మెరిసింది. శిక్షకులు రేణుక, వీజీఎస్ రాకేశ్ ప్రోత్సాహంతో రాగలిగింది. జాతీయ అథ్లెటిక్స్ శిక్షకురాలిగా ఎదగాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగమే లక్ష్యం



నిర్మల్ జిల్లా చిట్యాలకు చెందిన రాజు–సరోజ దంపతుల కుమార్తె దివిటి అరుణ. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాల పంట పండిస్తోంది. ప్రస్తుతం ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) సెకండియర్ చదువుతోంది. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో హ్యామర్ త్రో, డిస్కస్ త్రో ఈవెంట్లలో మొత్తం ఐదు పతకాలు సాధించింది. హ్యామర్ త్రోలో రెండు రజతం, 2 కాంస్య, డిస్కస్ త్రోలో కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తానని ధీమాగా చెబుతోంది.

వ్యాయామ ఉపాధ్యాయురాలవుతాను



నిర్మల్ జిల్లా కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన చిన్నయ్య–చిన్నక్క దంపతుల కుమార్తె సీహెచ్. వసంత. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటుతోంది. పోటీల్లోని ట్రిపుల్ జంప్, హ్యామర్ త్రో ఈవెంట్లలో ఇప్పటివరకు 8 పతకాలు సాధించింది. యూనివర్సిటీ లెవల్లో హ్యామర్ త్రో ఈవెంట్లో కాంస్య పతకంతో సత్తా చాటింది. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతున్న ఆమె వ్యాయామ ఉపాధ్యాయురాలిగా కెరియర్ ఎంచుకుంటా అంటోంది.

సౌత్ ఏషియన్ పోటీల్లో కాంస్యం



నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం సాత్గాం గ్రామానికి చెందిన బి.గౌరి అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించింది. గతేడాది జూలైలో నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన మొదటి సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంది. ఈ పోటీల్లో భారత జట్టు తృతీయ స్థానం సాధించగా, ఆమె కాంస్య పతకం గెలుచుకుంది. శిక్షకుల ప్రోత్సాహంతో మరిన్ని క్రీడా పోటీల్లో రాణిస్తానని చెబుతోంది.

నాలుగు గంటల సాధన



నిర్మల్ జిల్లా ముధోల్ మండలం అష్ట గ్రామానికి చెందిన రాజశేఖర్–సుగుణ దంపతుల కుమార్తె బి.స్వాతి. అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది. ఇప్పటి వరకు స్టీపుల్ చేజ్, జావెలిన్ త్రో ఈవెంట్లలో రెండు పతకాలతో మెరిసింది. ఇప్పటివరకు ఒక రజతం, ఒక కాంస్య పతకంతో సత్తా చాటింది. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నాలుగు గంటలు సాధన చేస్తున్నానని చెబుతోంది. మరిన్ని క్రీడా ఈవెంట్లలో సత్తా చాటడానికి, నిరంతరం క్రీడా నైపుణ్యాలు అలవర్చుకుంటానని తెలుపుతోంది.

అన్నిరంగాల్లో మహిళల పాత్ర కీలకం


మహిళా ఉద్యోగులకు లంచ్‌బాక్స్ అందిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: అన్నిరంగాల్లో మహిళల పాత్ర కీలకమని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు..ముఖ్యమంత్రులు, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం మహిళా ఉద్యోగులకు లంచ్ బాక్స్‌లు అందజేశారు.

నారీశక్తి పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు, అతిథులు

నిర్మల్‌ఖిల్లా: అన్నిరంగాల్లో మహిళలు రాణించడం శుభ పరిణామమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం 'పాటే మా ప్రాణం'సంగీత అకాడమీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి 'నారీశక్తి పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్లు రజిని, చంద్రిక, న్యాయవాది నివేదిత, సుగుణ, ఎస్సై రోహిణి, ఎఫ్ఆర్వో శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రాణి, కేజీబీవీ ఎస్ఓ లతాదేవి, విజయలక్ష్మి, స్వాతి, లక్ష్మి, శ్రీలత, రాజ్యలక్ష్మి పురస్కార గ్రహీతలు ఉన్నారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ ముత్యం రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, ప్రముఖవైద్యులు యు.కృష్ణంరాజు, సంగీత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నవ్య, కార్యదర్శి శ్రీకాంత్ సభ్యులు వాణిశ్రీ, కవిత, మమత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


గణేశ్ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని బోరిగాం బస్టాండ్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన బొడిగే గణేశ్ (26) ఆదివారం రాత్రి నిర్మల్‌లో ఉంటున్న ఆయన భార్య వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలో మృతిచెందాడు. మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబీకులు కన్నీటిపర్యంతమయ్యారు.

గోడ మీదపడి కూలీ..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: మండలంలోని నవేగాంలో కూలీపై గోడ పడి మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నవేగాం గ్రామానికి చెందిన కొద్దెన లస్మయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గ్రామానికి చెందిన బొల్లు తిరుపతి ఇంటి పనుల కోసం సోమవారం లస్మయ్యను కూలీని పిలిచారు. పని నిమగ్నమై ఉన్న సమయంలో ఒక్కసారిగా లస్మయ్యపై గోడ కూలి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి అన్న రాజయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడు..

ఆదిలాబాద్‌రూరల్: మావల శివారు ప్రాంతంలో గల ఎర్రకుంటలో ఒకరు అనుమానాస్పదంగా మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మావల గ్రామానికి చెందిన షేక్ ఫర్వేజ్ అదే గ్రామంలోని పెట్రోల్ పంపులో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాలేదు. కుటుంబ సభ్యులు రాత్రి వరకు గాలించిన ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం ఎర్రకుంట ప్రాంతం వైపు వెళ్లిన మావలకు చెందిన సతీశ్.. మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కుమారుడి మృతిపై అనుమానం ఉందని తల్లి రెహానా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి ఒకరు..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని బోయవాడ కాలనీకి చెందిన పిండి విజయ్ (36) ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందాడు. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. విజయ్ ఇంటి అవసరం నిమిత్తం కట్టెలు ఏరేందుకు మండలంలోని కామాయిపేట అటవీ ప్రాంతానికి ఆదివారం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో దాహం వేయగా గ్రామ సమీపంలోని కుంటలో నీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. ఆదివారం రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం కుంట వద్ద చెప్పులు చూసి గ్రామస్తులు పోలీసులకు సమాచారమివ్వడంతో స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాడీబిల్డింగ్ ఓవరాల్ చాంపియన్ వెంకటేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాడీబిల్డింగ్ ఓవరాల్ చాంపియన్‌గా మంచిర్యాల జిల్లా పాత మంచిర్యాలకు చెందిన మాసు వెంకటేశ్ నిలిచాడు. సీసీసీలో తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బాడీ బిల్డింగ్ జూనియర్, సీనియర్, మాస్టర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన పలువురు బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. మాసు వెంకటేశ్ అన్ని కేజీల విభాగాల్లో మంచిర్యాల జిల్లా చాంపియన్‌గా నిలిచాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన చాంపియన్ ఆఫ్ ద చాంపియన్ పోటీల్లోనూ విజేతగా నిలిచాడు.


చాంపియన్‌గా నిలిచిన వెంకటేశ్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు, బాడీ బిల్డర్లు

విధి నిర్వహణలో ఆగిన ఊపిరి..

- ఐకే–1ఏ గనిలో యువ కార్మికుడి మృతి
- విధులు నిర్వహిస్తుండగా కుప్పకూలిన వైనం..
- గని ప్రమాదంగా గుర్తించాలని కార్మిక సంఘాల డిమాండ్


రాంచందర్ మృతదేహం

జైపూర్: ఆయన ఓ యువ కార్మికుడు. మెడికల్ ఇన్వ్యాలిడేషన్ ద్వారా మూడేళ్ల క్రితం సింగరేణి ఉద్యోగం పొందాడు. శిక్షణ పూర్తి చేసుకుని ప్రస్తుతం శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఐకే–1ఏ గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం దాసరిపల్లి నుంచి నిత్యం విధులకు హాజరవుతున్నాడు. ఈ క్రమంలో రోజుమాదిరిగానే సోమవారం ఉదయం విధులకు వచ్చాడు. విధులు నిర్వహిస్తూనే కుప్పకూలాడు. తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దాసరిపల్లి గ్రామానికి చెందిన పసునూరి సుభద్ర–రాజమల్లు దంపతుల కుమారుడు రాంచందర్(32) తన తండ్రి మెడికల్ ఇన్వ్యాలిడేషన్ ద్వారా మూడేళ్ల క్రితం ఉద్యోగం పొందాడు. ఐకే–1ఏ గనిలో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాంచందర్ భూగర్భ గనిలోకి కార్మికులు వెళ్లే రెండో మ్యాన్‌రైడింగ్ వద్ద మోటార్ ఆన్, ఆఫ్ సిస్టం మెయింటెన్స్ వర్కక్ కేటాయించారు. ఉదయం 7 నుంచి 8:30 గంటల వరకు రెండో మ్యాన్ రైడింగ్ ద్వారా కార్మికులు గనిలోకి దిగగా రాంచందర్ మ్యాన్ రైడింగ్ ఆపరేట్ చేశాడు. 9:20 తర్వాత కళ్లు తిరగడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన సహచర కార్మికులు సపర్యలు చేశారు. అయినా పరిస్థితి మెరుగు పడకపోవడంతో సీపీఆర్ కూడా చేశారు. అయినా స్పందన లేకపోవడంతో హుటాహుటీగా రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒక్కగానొక్క కొడుకు..

సుభద్ర–రాజమల్లు దంపతులకు రాంచందర్, ఇద్దరు కూతుళ్ల సంతానం. ఒక్కగానొక్క కొడుకు ప్రయోజకుడు కావాలని రాజమల్లు మెడికల్ ఇన్వ్యాలిడేషన్ ద్వారా తన ఉద్యోగాన్ని మూడేళ్ల క్రితం కొడుకుకు పెట్టించాడు. అప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. అయితే అకస్మాత్తుగ ఒకకగానొక్క కొడుకు విధి నిర్వహణలో మరణించడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. తమకు అండగా ఉంటాడనుకున్న కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. రాజమల్లు ఫిర్యదు మేరక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గని ప్రమాదంగా గుర్తించాలి..

రాంచందర్ మరణాన్ని గని ప్రమాదంగా గుర్తించి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల స్పెషల్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని హెచ్ఎంఎస్ నాయకులు తిప్పారపు సారయ్య, అనిల్‌రెడ్డి డిమాండ్ చేశారు. యువ కార్మికుడు విధినిర్వహణలో మరణించడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో కార్మికుడు ఏ కారణంతో మరణించినా ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఐకే–1ఏ గనిలో శ్రీనివాస్ అనే యువ కార్మికుడు చనిపోయాడని తెలిపారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు సోమగూడెం క్రీడాకారుడు


ఎంపికైన శంకర్‌తో కోచ్ శేఖర్

కాసిపేట: జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సోమగూడెంకు చెందిన గురునాథం శంకర్ ఎంపికయ్యాడని కోచ్ బాదె శేఖర్ తెలిపారు. నవంబర్ 25, 26, 27 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ఏప్రిల్ 15 నుంచి 21వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటాడని తెలిపారు.

గ్రూప్–1 ఫలితాల్లో ప్రతిభ


సచిన్‌రెడ్డి


కార్తీక్‌రెడ్డి


అశోక్


లావణ్యరెడ్డి

తాంసి: గ్రూప్–1 ఫలితాలను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఇందులో పలువురుయువకులు ప్రతిభ కనబర్చారు. కొందరు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు ఉన్నారు. పరీక్ష రాసి ఉత్తమ మార్కులు సాధించారు. తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్‌కు చెందిన సురుకుంటి సచిన్.. 454.5 మార్కులు సాధించాడు. ఈయన వార్డు ఆఫీసర్‌గా ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామానికి చెందిన ఎల్టి కార్తీక్‌రెడ్డి..443 మార్కులు సాధించాడు. బోథ్ మండలం ధనోర గ్రామానికి చెందిన నల్ల లావణ్యరెడ్డి..తాంసి మండలం హస్నాపూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తోంది. ఓ వైపు విధులు నిర్వహిస్తూనే గ్రూప్–1 పరీక్ష రాయగా 441.5 మార్కులు సాధించింది. తాంసికి చెందిన జానకొండ అశోక్ పంచాయతీ కార్యదర్శిగా జైనథ్ మండలం సుందరగిరిలో విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్–1 పరీక్ష రాశాడు. 398.50 మార్కులు సాధించాడు.

అ'పూర్వ' సమ్మేళనం

బెల్లంపల్లి: బెల్లంపల్లి శాంతిఖని బస్తీ ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 1988–89 బ్యాచ్ ఏడో తరగతి పూర్వవిద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. గురువులు, పూర్వ విద్యార్థులు కృష్ణకుమార్, వెంకటస్వామి, వాసు, వెంకటేశ్, సత్యం, రాజు, శ్రీశైలం, రాజేశ్వరి, సునీత పాల్గొన్నారు.


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు